# చదువుకునేటప్పటి చిదంబరం

రచయిత:

యం. వి. కృష్ణరావు, బి. ఏ., (ఆనర్సు)

నేను ప్రెసిడెన్సీలో ఆనర్సు చదివేదినాల్లో జరిగినసంగతులు: ఆ హాయిదినాలు తలుచుకుంటేనే చాలు!– మామిత్రబృందంలోకల్లా గట్టివాడు శాస్త్రి. శాస్త్రి పొట్టిగా లావుగా నల్లగా ఉండేవాడు. సన్యాసులమాదిరి సర్వకాల సర్వావస్థలయందు కాషాయవస్త్రాలు. బ్రహ్మచారికాబట్టి– అయినా మనలోమాట, వాడికి పిల్లనిచ్చేదెవరు? – యితణ్ణిచూసిన ప్రతిపిల్లా – ఈశారదాబిల్లు తర్వాత అంతా ఎదిగి వివేకవిచక్షణజ్ఞానంకలవారు గాదండీ మరి!——మేము చేసుకోమో అని, లేకపోతే పగలుచూస్తే రాత్రికల్లోకి వస్తాడని తిరస్కరించారు – హామేషా గూడకట్టు, మోకాళ్ళవరకు పంజాబీలాల్చీ, హైరోడ్డుక్రాపు, కాళ్లకేమున్నా కిర్రుచెప్పులు వేసుకుని బయలుదేరాడంటె సాక్షాత్తు స్మశానంనుంచి టవును కొచ్చిన పెంటపాడుబైరాగి లాగుండేవాడు. ప్రపంచంలోని అన్నివిషయాల్నిగురించి సవిస్తరంగా తెలుసునంటాడు శాస్త్రి; మంచినీళ్ళప్రవాహంలా యెన్నిగంటలైనా యేవిషయాన్నిగురించైనా ఊకదంపుడు చేసే అగ్గిబరాటా. అవకాశంవస్తే యెవర్నిపడితే వాళ్ళని కళ్ళనీళ్ళపర్యంతం వచ్చేటట్లు చేయగల సమర్థుడు.

మామండలిలో చిదంబరం అనే సింపిల్టన్ వుండేవాడు. అలగాడు పరమయోగ్యుడు. అయితే 'బారిస్టరు పార్వతీశం' అంత ఘనుడు. ఆత్మస్తుతిలో పెట్టిందిపేరు; వాడు కోసేకోతల కంతులేదు. వాడికి కొంచెంగా కీయిచ్చి విడిచిపెట్టే పాడటానికి 3 తవ్వాలు, పాటాపటానికి 6 తవ్వాలు కావాలన్న బుద్ధిమంతుడిమాదిరి పూతపట్టాడు. చిదంబరానికి కించిత్ పొడుం అలవాటు కూడా కద్దు.

ఒకనాడు సాయంకాలం పొద్దుపోకపోతే చిదంబరాన్ని తీసుకెళ్లా మెరీనాకి. కూర్చున్నప్పటినుంచి మళ్ళీ బయలుదేరేవరకు వాడి సొంతఘోషే; ఒకటేమోత.

"ఇదుగో, రావు! ఎవరితోచెప్పకేం. (అందరితోటి యిదేవరసట) నాసతీమణి అసమాన సౌందర్యవతి. (యింకాయేమన్నా చెబుతాడేమోనని యెదురుచూశా). ఏమంటావు?"

"నన్నేమనవంటావయ్యా! నేను చూడలేదు, అట్లాంటిది నేనేమి చెప్పలేను. నీసతీమణి చాలబాగుంటె నువ్వే తంటాలుపడు.ఎవరొద్దన్నారు, మధ్య నాప్రాణాలు కొరుకుతావెందుకు?"

"ఆఁహాఁ. అదికాదు సంగతి. నాభార్యకు ఈడువచ్చి వడసారం అయిదేళ్ళయింది. మామగారు శుభకార్యం కానివ్వమంటారు. మనం యింగ్లీషువాళ్ళపద్ధతుల్ని అనుసరిస్తాం కాబట్టి యిట్లాంటివి బహిరంగంగా చేసుకోవడం నాకిష్టంలేదు. నీసలహా యేమిటి?"

"మనవాళ్లు యేదిచేసినా బహిరంగమో అని పడిచస్తారు, పిల్లలుపుట్టినా, చచ్చినా, ఆడపిల్ల సమర్తాడినా, శోభనంచేసుకున్నా, ఒకటేమిటి? కర్మకాండ అంతులేకుండా పెరి

గిన తర్వాత మతం యావత్తు నాశనమైపోయింది. ఈబహిరంగాలతో చచ్చిపోతున్నాం. ఎవడిక్కావా లివన్నీ; ప్రజాబాహుళ్యానికిట్లాంటి విషయాల్లో యేమంత ఉత్సాహముంది? సరే ఈగోలకేంగాని, అడగటం మరిచాను. క్రిందటినెల నూరు రూపాయిలు వచ్చినట్లుంది. అదంతా యేమైంది? నెల తిరగక ముందే మళ్లా తెప్పించావు.''

''దానికి చాల పెద్దగాథవుందిలే. ఆనాడు సాయంకాలమే చెల్లారాంపాపుకెళ్లి యీఆకుపచ్చ సర్జికోటు కుట్టించాను (చిదంబరం తొడుక్కున్నకోటు చాల పాతదిలెండి! వాళ్ళ బాబు చిన్నప్పుడు కుట్టించుకొని వుంటాడు; కుట్టుమాదిరికూడా పురాతనమే!) బట్ట మాత్రం 75 రూపాయిలు. వాడిసిగతరగా ఆయిస్టాయిల్ కోటుకుట్టడానికి ఫక్తు పదిరూపాయిలు తీసుకున్నాడు. ఆరాత్రే రాక్సీకి వెళ్లి హాస్టలుకి చేరుకునేసరికి జేబులో ఐదురూపాయిలున్నాయి - నమ్ము నమ్మకపో. (నూరేమైనాయో దేవుడికేయెఱుక - బహుశ నలభై యే వచ్చాయేమో; వచ్చిందానికంటె యెక్కువ చెప్పుకునే బడాయికోరు మాచిదంబరం!)

''అరేచిదంబరం! ఇక పూతచాలు. ఎనిమిదవవచ్చింది; యింక పొద్దుపోతే హాస్టల్లో దేవతార్చనుండదు. తెల్లవార్లు పస్తుపడుకోవాల్సివస్తుంది.''

* * *

ఆదివారం మధ్యాహ్నం అందరు 'అన్నాకరినీనా'కి పట్టుపట్టమన్నారు. చిదంబరంచేత సూటువేయించా రానాడు. గుండీలులేని సన్నని గొట్టాలాంటి పంట్లాము. మేజోళ్లులేకుండా కాళ్లకు బ్రౌన్ కాన్వాసుజోడు - యిప్పడిదేఫేషనట - పట్టీపట్టని ఆ ఆకుపచ్చ సర్జికోటు, ఎందుచేతో తిరగకుండా ఆగిపోయిన చేతిగడియారం (బహుశ వాడిమామగారు వివాహసందర్భంలో కానుకగా యిచ్చివుంటారని శాస్త్రి రిసెర్చిచేసి కనిపెట్టాడు). టర్కీటోపీ పెట్టుకుని అచ్చుమచ్చు ఊదువత్తులవాడిలా బయలుదేరాడు. వాడివేషంచూస్తే మాకు కడుపు చెక్కలయే టంత నవ్వువచ్చింది. బయటకు నవ్వేస్తే కనిపెట్టి రాడేమోనని పొంగిపొరలి వస్తూన్న నవ్వుని ఆపుకున్నాం.

ఒక చక్కని ఆంగ్లోయిండియన్ అమ్మాయి. వయసులోనిపిల్ల. సన్నగా, నాజూకుగా- అవయవపటుత్వాన్ని వెల్లడిస్తూన్న గౌనుతో, గుమగుమాయింపుతో 'పేరగన్' థియేటరులో కూర్చునిఉన్నది. అందరికి ఆసౌందర్య దృశ్యాన్ని చూడకుండా ఉండటం కష్టమైంది. మాచిదంబరంకళ్లు ముందా పిల్లమీదపడ్డాయి. ఆఅమ్మాయి ప్రక్కనే నదురు బెదురు లేకుండా పీఠంవేశాడు. మేముకూర్చుని కాసేపైందోలేదో ఫిలిమ్ బులెటెన్సు అమ్మేవాడు వచ్చా డాప్రాంతాలకి. ఆ ఆంగ్లోయిండియన్ వనిత వాడిని పిలిచింది. ఆపిల్లదగ్గర నోట్లేఉన్నాయి- చిల్లరలేదుట- మావాడివంక అర్థయుక్తంగా చూసిందిట. మాచిదంబరం వెంటనే ''ఐ షల్ పే హిమ్'' అని కిన్నెరసాని గొంతుతో అన్నాడు, తిరిగి యిస్తుంది గదా అనే సదుద్దేశంతో. నిజానికి చిదంబరం అంత్యోపయోగం (మార్జినల్ యుటిలిటీ) లేందే కానీ ఖర్చుపెట్టే ఘటంకాదు.

పిక్చెరు మొదలుపెట్టినప్పటినుంచీ మా చిదంబరానిది పక్కచూపేగాని ముందుచూపు లేనేలేదు. మధ్యలో ఆవగలాడితో యేవిధంగానైనా కల్పించుకుని మాట్లాడటానికి సర్వవిధాలా ప్రయత్నంచేశాడు. అయితే ఆఅమ్మాయి ఉలకలేదు - పలుకంతకన్నాలేదు. ఏదో పిక్చెర్ని చూడటానికంటె వచ్చిందిగాని వీడితో

బాతాఖానీ కొట్టడానికి రాలేదని తెలియదు మాచిదంబరానికి. పిక్చెరు అయిపోయింది.

"చిదంబరం! ఆ ఆంగ్లోయిండియన్ పిల్ల తిరిగి నీ అణాయిచ్చిందీ ? నీపని ట్రాజడీ యట్ వరస్టు అయిందిలే!"

"ఏమితపంబొనర్చి జనియించినవాడనో- శాస్త్రి! తిరిగి యియ్యకపోతేనేం ?"

"ఏమిటిరా కథ; యేంజరిగిందేమిటి ?"

"పిక్చెర్ మంచి రసకందాయపు పట్టులో ఉన్నప్పుడు ఉక్కగాఉందంటె సర్జికోటు తీశాను. చీకట్లో ఆవనితేంచేసిందనుకున్నారు? నాచేతులు ఆడవాళ్ల చేతుల్లా మెరిసిపోతున్నాయి చీకట్లో. నాచేతిమీద తనచెయ్యివేసింది. ఏమనుకుందో మన పెర్సనాలిటీచూసి డంగయిపోయిందేమో! వెధవ అణాపోతే పోయిందిగాని, ఏమి సుఖమనుకున్నావు, శాస్త్రీ!"

"అయితే ఎక్కడన్నా లంగరుఅందినట్లేనా? చిదంబరం."

సన్యాసివాడి కర్థమైతేగా ఆవజ్రపుతునకలాంటి ముక్క. మాచిదంబరం యెంత అల్పసంతోషో మాకప్పుడు బోధపడింది. * * *

చిదంబరంమీద ఒక ప్రాక్టికల్ జోక్ చెయ్యాలని గూడుపుఠాణాచేసి స్కీమొకటి తయారుచేశాం. శాస్త్రి యేస్నేహితుడియింట్లోనుంచన్నా ఫోనులో చిదంబరాన్ని పిలవడం: "హల్లో చిదంబరంగారు! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు - నేను మృణాలిన్ని. మనం రాజమండ్రీ హైస్కూల్లో సహపాఠులం. నేనిప్పుడు క్వీన్‌మేరీస్ కాలేజీలో చదువుతున్నా. రేపు సాయంకాలం ఆరుగంటలకల్లా మైలపూరు బీచికి తప్పకుండారండి"......... అటునుంచి నరుక్కురమ్మన్నారు.

మర్నాడు సాయంకాలం ఐదుగంటలకల్లా రంగున పేఠెంటు యూనిఫారమ్‌లో బయలుదేరాడు చిదంబరం.

"ఎక్కడికిరా చిదంబరం?"

'అరే బ్రదర్. సెంట్రలుకి వెడుతున్నా. సాయంకాలం మెయిలు (?) లో మాబాబు వస్తారుట. ఈదినం మీతో షికారుకి రాలేన"ని యెట్లాగైతేనేమి ఉడాయించాడు.

శాస్త్రి, నేను వాడువెళ్ళిన పావుగంటకి వేరేదారిని మైలపూరుబీచికి పట్టించాం. మేము వెళ్ళేసరికి కాచిదంబరం యేంచేస్తున్నాడనుకున్నారు ?. కొత్తపిట్ట తలవని తలంపుగా తనవల్లోపడ్డదనుకుని ఆడవేషంలోఉన్న మా సీతాపతిని గట్టిగా కావలించుకుని......

"చిదంబరం! ఆగు. మేమింతమంది నీ ప్రాణస్నేహితులం ఉండగా నువ్వొక్కడవు మాత్రం ఆసుఖం అనుభవించాలీ ?"

ఆమాటలు వినేసరికి చిదంబరానికి నిలువల్లా ముచ్చెమటలు పోసి నిస్తబ్ధుడైనాడంటె నమ్మండి. నవ్వాపట్టలేక సీతాపతి

"సమయానికి వచ్చారురా బాబు! లేకపోతే కొంపతీసి నన్ను మృణాలినే అనుకుని వద్దు వద్దన్నా - నోట్లోవేలుపెట్టినా కొరుకలేడని మీరన్న చిదంబరం-నన్ను ఉక్కిరి బిక్కిరి అయేటట్లు కావలించుకుని బుగ్గలు ఘాట్లు పడేటట్లు కొరికేవాడే" అని గట్టిగా అనేశాడు. అసలు మాసీతాపతి లవ్‌డ్‌స్పీకర్.

"శాస్త్రి! మీరింతవాళ్ళని యెన్నడూ అనుకోలేదు. మంచివాళ్ళ కివి రోజులుకావు" అని చిదంబరం గుడ్లనీరు గ్రుక్కుకున్నాడు.

తగినశాస్తి అయేసరికి చిదంబరంలో తగిన మార్పు కలిగిందని శాస్త్రి పుకారు వేశాడు; అయితే నాకుమాత్రం నమ్మకం లేదు. ఎంచేతనంటె మాచిదంబరంతత్వం యింత తొందరగా మారుతుందా? ఆ విషయాన్ని గురించి కాలమే తెలుపుతుంది.